తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం - 24 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 356 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# యాదాద్రిలో ఆధ్యాత్మిక మహాప్రాజెక్ట్

- తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాలకు శ్రీకారం
- రూ.99 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన
- తిరుమల తరహాలో యాదాద్రి అభివృద్ధికి భారీ ప్రణాళిక
- వేద విద్య, భక్తి వైభవానికి కొత్త అధ్యాయం

**యాదాద్రి, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి భూమిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య సమక్షంలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద సంప్రదాయ పరిరక్షణతో పాటు యాదాద్రిని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. వేద పాఠశాలతో పాటు యాదాద్రి టెంపుల్ సిటీ పరిధిలో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. మొత్తం రూ.99.55 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు యాదాద్రి రూపురేఖలను పూర్తిగా మార్చనున్నాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
యాదాద్రిని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం పేర్కొన్నారు.

మిగతా 2లో..

## రెండో విడత
# ఇందిరమ్మ ఇళ్లకు ఆమోదం

- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల మంజూరు
- ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల కేటాయింపు
- జూన్ 1న రెండో విడత ప్రారంభించనున్న సీఎం
- కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో రెండో విడత కింద 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఇందిరమ్మ ఇండ్లతో పాటు పలు కీలక అంశాలకు ఆమోదముద్ర వేశారు.
ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలోని 24 నియోజకవర్గాల్లో కూడా 1 లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ఇంటి స్థలం లేని నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రస్తుతం వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించి ఇళ్లు

మిగతా 2లో..




# టీజీసీఈటీ ఫేజ్-2 ఫలితాల విడుదల

- గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి అవకాశం
- 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు
- జూన్ 7 వరకు అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయాలి
- విద్యార్థులకు చీఫ్ కన్వీనర్ శారద సూచనలు

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీసీఈటీ2026 ప్రవేశ పరీక్ష ఫేజ్ 2 ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు చీఫ్ కన్వీనర్ శారద తెలిపారు. సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈ ఫలితాలను ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ ఫేజ్ 2 ఫలితాల ద్వారా 6వ తరగతి




నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పర్గి బాలికల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్,

మిగతా 2లో..



# ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ సంస్థల అండ

- తెలంగాణ విద్యారంగ అభివృద్ధికి భారీ సిఎస్ఆర్ నిధులు
- ప్రభుత్వ విద్యాసంస్థల ఆధునికీకరణకు ఒప్పందాలు
- సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఎంఓయూలు
- పాఠశాల మౌలిక వసతుల బలోపేతానికి చర్యలు

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యారంగ బలోపేతానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల కింద రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్ ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో సచివాలయంలో పాఠశాల విద్యా శాఖతో ఈ మూడు సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి, మౌలిక వసతుల ఆధునికీకరణ కోసం ఈ ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. ఒప్పంద పత్రాలను నీల్ రహేజా, అల్లా దక్షయాణి, గోరుకంటి దేవేందర్ రావు ముఖ్యమంత్రికి అందజేశారు. రామ్‌కీ ఫౌండేషన్ మెదక్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని జవహర్‌నగర్‌లో ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు సమగ్ర విద్యా క్యాంపస్ నిర్మాణానికి మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం వాటాగా రూ.19.66 కోట్లు అందించనుంది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కూడా రూ.10.4 కోట్లు కేటాయించనుంది.
కే రహేజా గ్రూప్ రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ స్థాయి వరకు విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి రూ.50.50 కోట్లు ఖర్చు చేయనుంది. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. యశోద ఫౌండేషన్ ఉప్పల్ సుభాష్‌నగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రీప్రైమరీ, 6వ, 7వ తరగతుల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.12.20 కోట్లు అందించనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ సి.శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.



# తాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ ధర్నా

- ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం ఎదుట నిరసన
- జంటనగరాల్లో నీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):**

జంటనగరాల్లో తీవ్రంగా నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ శనివారం ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించింది. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని అనేక కాలనీలు, బస్తీల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వేసవి తీవ్రత పెరుగుతున్న సమయంలో ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. నీటి కొరతతో ప్రజలు గంటల తరబడి ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాల్లో తాగునీటి సమస్య రోజురోజుకు మరింత తీవ్రమవుతోందని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. వెంటనే అన్ని ప్రాంతాలకు సమయానికి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ధర్నాలో పాల్గొన్న నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజలకు కనీస

మిగతా 2లో..

# రైతులకు ఆధునిక సాంకేతికత

- వ్యవసాయ వర్సిటీలో విత్తన వారోత్సవాల ప్రారంభం
- డ్రోన్లు, రోబోటిక్స్ పరిశోధనలపై మంత్రి ప్రశంసలు
- మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుపై సూచనలు
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడుల లక్ష్యం

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):**

రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన విత్తన వారోత్సవాలు-2026 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన మూల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముందు మంత్రి విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీని సందర్శించారు. డ్రోన్ల వినియోగంపై జరుగుతున్న పరిశోధనలు, భవిష్యత్ వ్యవసాయ రంగంలో వాటి ప్రాధాన్యంపై శాస్త్రవేత్తలతో చర్చించారు. వ్యవసాయ రంగంలో కూలీల కొరత పెరుగుతున్న నేపథ్యంలో డ్రోన్ ఆధారిత వ్యవసాయ పద్ధతులు రైతులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఎస్‌బీఐ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ఏర్పాటు చేసిన రోబోటిక్స్, సెన్సార్ ఆధారిత ప్రయోగశాలను కూడా మంత్రి పరిశీలించారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే విధంగా రోబోలను అభివృద్ధి చేయడాన్ని అభినందించారు. అలాగే ఆర్ఎస్ అండ్ జీఐఎస్ ప్రయోగశాలలో

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# యాదాద్రిలో ఆధ్యాత్మిక మహాప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

భక్తులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు వేద సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యాదాద్రి అభివృద్ధి తెలంగాణ ఆధ్యాత్మిక చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని సీఎం వ్యాఖ్యానించారు. రూ.43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ భారీ వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల విధానంలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్య అందించనున్నారు. ఈ సముదాయంలో యాగశాలలు, హోమ మండపాలు, వేద అధ్యయన కేంద్రాలు, గోశాల వంటి ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణలో ఈ వేద పాఠశాల కీలక కేంద్రంగా నిలవనుందని పండితులు అభిప్రాయపడుతున్నారు. ఇదే కార్యక్రమంలో రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణ పనులకు కూడా భూమిపూజ జరిగింది. అలాగే కొండపై స్వామివారి నిత్య కల్యాణోత్సవాల నిర్వహణ కోసం రూ.9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం నిర్మించనున్నారు. భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యంగా వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ.1.41 కోట్లతో రక్షణ కానోపీ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ.1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. యాదాద్రికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే యాదాద్రి దేశంలోనే అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటిగా నిలవనుందని భావిస్తున్నారు.

# రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

నిర్మించి ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. అదేవిధంగా రాష్ట్రంలో పూరిగుడిసెల్లో నివసిస్తున్న 15 వేల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందించాలని తీర్మానించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రూ.1000 కోట్లు కేటాయించింది. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి భూసేకరణ, పునరావాసం, మౌలిక వసతుల కోసం రూ.587 కోట్లు మంజూరు చేసింది.
విద్యుత్ పంపిణీ, మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు తెలంగాణ డిస్కంల ప్రతిపాదనలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని డీసీఎంఎస్‌లను మార్క్‌ఫెడ్‌లో, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను హాకాలో విలీనం చేయాలని నిర్ణయించింది. 2030 నాటికి తెలంగాణను ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలనే లక్ష్యంతో నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 202630కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు, 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఈ పాలసీ రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# టీజీసీఈటీ ఫేజ్-2 ఫలితాల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం బాలుర స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 8వ తరగతి రెగ్యులర్ ప్రవేశాల కోసం కూడా ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 22న రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన వివరాలను కూడా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు తమకు కేటాయించిన విద్యాసంస్థల్లో హాజరై ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చీఫ్ కన్వీనర్ సూచించారు. సంబంధిత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.
గ్రామీణ ప్రాంతాలు, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో గురుకుల విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శారద పేర్కొన్నారు. గురుకుల విద్య ద్వారా అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్లను పరిశీలించాలని అధికారులు సూచించారు. ప్రవేశ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు.

# రైతులకు ఆధునిక సాంకేతికత

(మొదటి పేజీ తరువాయి)

ఉపగ్రహ ఆధారిత గణాంకాలపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలోని మొత్తం వ్యవసాయ భూమిలో సుమారు 9.3 శాతం భూమి సాగులో లేదని అధికారులు మంత్రికి వివరించారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విత్తన వారోత్సవాలు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడంలో కీలకమని మంత్రి అన్నారు. కొన్ని ప్రైవేటు విత్తన సంస్థల మాయ మాటలకు మోసపోకుండా రైతులు విశ్వవిద్యాలయం అందించే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని పిలుపునిచ్చారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలను పాటించాలని మంత్రి సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక సాంకేతికతలను రైతులకు అందుబాటులోకి తీసుకురావడంలో విశ్వవిద్యాలయం ముందుండాలని అన్నారు. రైతులతో నిరంతరం మమేకమై వారి సమస్యలకు పరిష్కారాలు అందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య, పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరామ్, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ వై. చంద్ర మోహన్ తదితర శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వామ్యం

- **తెలంగాణను అంతర్జాతీయ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం**
- **పెట్టుబడిదారులకు సంపూర్ణ సహకారం అందిస్తాం**
- **పర్యాటక సదస్సులో మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో నిర్వహించిన "డెస్టినేషన్ తెలంగాణ - రోడ్ అహెడ్" పర్యాటక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజన్‌గా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, సంస్థలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతిపాదనలు, డీపీఆర్‌లతో వస్తే ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానంలో భాగంగా పెట్టుబడిదారులకు పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన వినియోగంలో లేని ఆస్తులను పర్యాటక అవసరాల కోసం దీర్ఘకాలిక లీజు పద్ధతిలో కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని జూపల్లి వెల్లడించారు. పర్యాటక ప్రాజెక్టుల్లో కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతకు పెద్దపీట వేస్తామని తెలిపారు. ఎంపిక చేసిన ప్రాంతాల అభివృద్ధికి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ప్రకటనలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. కొన్ని పర్యాటక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవని మంత్రి పేర్కొన్నారు. తాగునీరు, టాయిలెట్స్, వసతి గృహాలు, రెస్టారెంట్లు వంటి సదుపాయాల ఏర్పాటుకు ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాలని కోరారు. మొబైల్ గ్లాస్ హౌస్‌లు, కాన్వాస్ టెంట్లు వంటి ఆధునిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే అనుబంధ పరిశ్రమలు కూడా లాభపడతాయని, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి అన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా తెలంగాణలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే భువనగిరి కోటలో రోప్‌వే వంటి పర్యాటక ఆకర్షణలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు.

# మహిళా వారోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా సన్నాహాలు

- **మే 25 నుంచి 31 వరకు ఘనంగా నిర్వహణ**
- **మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యమన్న మంత్రి సీతక్క**

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత, విద్యా పురోగతి వంటి అంశాలను ప్రధాన లక్ష్యాలుగా తీసుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా వారోత్సవాల నిర్వహణ, కార్యక్రమాల షెడ్యూల్, ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయంలో మంత్రి సీతక్క ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా సామాజికంగా మరింత శక్తివంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ విద్యుత్ ప్లాంటును ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మహిళా సంఘాల ఆర్థిక శక్తికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 25న రాష్ట్రంలోని 100 గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించనున్నారు. అదే రోజు 8 వేల గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించనున్నారు. అదేవిధంగా 82 అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ప్రారంభించి, స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు పంపిణీ చేయనున్నారు. జిల్లా స్థాయిలో లోన్ మేళాలు కూడా నిర్వహించనున్నారు. 26వ తేదీన మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 553 ఆర్టీసీ బస్సులను ఫ్లాగ్ ఆఫ్ చేయనున్నారు. హైదరాబాద్‌లో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించడంతో పాటు బాల్య వివాహాల నిరోధానికి "బాల్య వివాహం బతుకు ఆగం" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా భద్రత, పోష్ చట్టంపై అవగాహన సదస్సులు, మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫార్మ్‌ల పంపిణీ వంటి పలు కార్యక్రమాలు కూడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్నారు. మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా మహిళల్లో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపేలా నిర్వహించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. మహిళా సాధికారతకు కొత్త దిశా నిర్దేశం చేసేలా ప్రతి కార్యక్రమం ఉండాలని పేర్కొన్నారు.

# ఎల్కతుర్తి అభివృద్ధిలో మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక పాత్ర



- **ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్**

**ఎల్కతుర్తి, మే 23( తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు జిల్లా ఖనిజ అభివృద్ధి నిధి ద్వారా రూ.30 లక్షలు మంజూరు చేయించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతగా శుక్రవారం ఎల్కతుర్తి అంబేద్కర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ మాట్లాడుతూ, మంత్రి పొన్నం ప్రభాకర్ ఎల్కతుర్తి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జిల్లా ఖనిజ అభివృద్ధి నిధి ద్వారా రూ.30 లక్షలు మంజూరు చేయించడం గ్రామ ప్రజలకు ఎంతో మేలు చేసే నిర్ణయమని అన్నారు.
అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, పేదలకు సన్న బియ్యం వంటి సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ఎల్కతుర్తి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నినాదాలు చేశారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రాజు, పాక రమేష్, శనిగరం వెంకటేష్, డాక్టర్ రమేష్, పి. రమేష్, బుచ్చి రాములు, మల్లాచారి, నవీన్, వసంత, సారయ్య, ప్రత్యూష, కిరణ్, వెంకటరమణ, అర్జున్, సాహూ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన తాగునీటిని కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. నీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జలమండలి కార్యాలయం పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులో ఉంచారు. తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ పోలీసుల్లో

# ఏఐ విప్లవం

- **భాష ఏదైనా ఫిర్యాదు నమోదు ఇక సులభం**
- **'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను ఆవిష్కరించిన సీపీ సజ్జనర్**
- **దేశంలోనే తొలి బహుభాషా ఫిర్యాదు నమోదు వ్యవస్థ**
- **స్మార్ట్ పోలీసింగ్‌లో హైదరాబాద్ మరో ముందడుగు**

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీసింగ్ వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికతను జోడిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ మరో చారిత్రాత్మక అడుగు వేసింది. భాషా సమస్యల కారణంగా బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు దేశంలోనే తొలిసారిగా "ఏఐ కాప్‌రైటర్" అనే కృత్రిమ మేధ ఆధారిత బహుభాషా ఫిర్యాదు నమోదు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఈ యాప్‌ను ఆవిష్కరించారు. నగరంలోని 80కు పైగా పోలీస్ స్టేషన్లలో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. బాధితులు తమ మాతృభాషలో చెప్పే ఫిర్యాదులను ఈ యాప్ వెంటనే రాతపూర్వక రూపంలోకి మార్చి, పోలీసులకు అర్థమయ్యే భాషలోకి అనువదిస్తుంది. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో ఇతర రాష్ట్రాల వలస కార్మికులు, పర్యాటకులు భాష తెలియక ఫిర్యాదులు ఇవ్వడంలో ఇబ్బందులు పడుతున్నారని అధికారులు తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా రూపొందించిన ఏఐ కాప్‌రైటర్ 10కు పైగా భారతీయ భాషలను గుర్తించే సామర్థ్యంతో పనిచేస్తుంది. ఫిర్యాదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషించనుంది. ఈ యాప్‌లో బహుభాషా సౌలభ్యం, వేగవంతమైన ఫిర్యాదు నమోదు, పారదర్శకత వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. ఫిర్యాదు నమోదు చేసిన అధికారి వివరాలు, సమయం వంటి సమాచారం ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో భద్రపరచబడుతుంది. బాధితుడు, నిందితుడు, సాక్షుల మాటలను వేర్వేరుగా గుర్తించి నమోదు చేసే మల్టీ పార్టీ లేబులింగ్ సదుపాయం కూడా ఇందులో ఉంది. హైదరాబాద్ ఒక గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న నేపథ్యంలో భాష ఎప్పటికీ న్యాయానికి అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. వలస కార్మికులు, మహిళలు, వృద్ధులకు పోలీసు సేవలపై మరింత భరోసా పెరుగుతుందని అన్నారు. ఫిర్యాదులు యథాతథంగా నమోదు కావడం వల్ల దర్యాప్తు నాణ్యత మెరుగై నిందితులకు శిక్ష పడే అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా హైదరాబాద్ సిటీ పోలీస్ ఇప్పటికే పలు ఏఐ ఆధారిత సాంకేతికతలను వినియోగిస్తోంది. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం "సిమిత్ర", సోషల్ మీడియా పర్యవేక్షణ కోసం "సాక్ఐ" వంటి వ్యవస్థలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తాజా ఏఐ కాప్‌రైటర్ యాప్‌తో ఫిర్యాదుల నమోదు ప్రక్రియ కూడా మరింత ఆధునికంగా మారనుంది.



# చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం..

- అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి..
- పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం బ్యూరో, మే 23(తెలంగాణ ముచ్చట్లు )**

అక్రమ రవాణా జరగకుండా పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా కట్టుదిట్టం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కల్లూరు డివిజన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. సరిహద్దు నుండి ఇసుక అక్రమంగా రవాణా చేసే వాహనాలపై (ట్రాక్టర్లు, టిప్పర్లు) చట్టపరమైన కేసులు నమోదు చేసి సీజ్ చేయాలన్నారు.

గంజాయి రవాణాను అడ్డుకోవడానికి స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా రేషన్ బియ్యం అక్రమంగా ఇతర రాష్ట్రాలకు లేదా మిల్లులకు తరలకుండా గోదాములు, వాహనాలపై నిఘా పెంచి, కఠినమైన కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై నాన్‌బైలబుల్ కేసులు పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. పండుగల సమయంలో చట్టవిరుద్ధంగా పశువుల రవాణా, వధింపులు జరగకుండా జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద వాహనాల విస్తృత తనిఖీలు చేయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడం చాల కీలకమన్నారు.

సమావేశంలో ఏసీపీ వసుంధర యాదవ్, ఏసీపీ సాంబరాజు, ఇన్స్పెక్టర్ శ్రీహరి, ముత్తులింగం, సర్వయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.



# సాయిస్ఫూర్తి విద్యార్థుల ఘన విజయం

బీటెక్ ఫలితాల్లో
ఉమ్మడి ఖమ్మంలో అగ్రస్థానం.

**సత్తుపల్లి, మే 23 (తెలంగాణ ముచ్చట్లు:** జేఎన్‌టీయూహెచ్ విడుదల చేసిన బీటెక్ నాలుగో సంవత్సరం ఫైనల్ పరీక్షా ఫలితాల్లో బి.గంగారం సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. ఈ విషయాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు.

*ఈఈఈ* విభాగంలో షేక్ రహమత్ పాషా 9.55 ఎస్‌జీపీఏతో ప్రథమ స్థానం సాధించగా, కనపర్తి గోపీచంద్, కొర్రా వెంకట నరసింహారావు, మందలోజు మేఘన 9.4 ఎస్‌జీపీఏతో ద్వితీయ స్థానంలో నిలిచారు.

*మెకానికల్ ఇంజనీరింగ్* విభాగంలో గంధం రామకృష్ణ 9.25 ఎస్‌జీపీఏతో మొదటి స్థానం సాధించగా, మోరంపూడి హిమంత్ 7.55 ఎస్‌జీపీఏతో రెండో స్థానం దక్కించుకున్నాడు.

*ఈసీఈ* విభాగంలో నడ్డి ప్రీతి, పామర్తి కావ్య 9.55 ఎస్‌జీపీఏతో ప్రథమ స్థానంలో నిలవగా, చిలకమర్తి సత్యహర్షిత, మోటమర్రి ఉశస్విని వినూత్న, పలివెల నాగకృష్ణ, సోమవారపు ప్రియ 9.4 ఎస్‌జీపీఏతో ద్వితీయ స్థానం సాధించారు.

*సీఎస్ఈ* విభాగంలో గరిడేపల్లి సాయిసునంద, పాలెం హరికీర్తి 9.7 ఎస్‌జీపీఏతో ప్రథమ స్థానంలో నిలిచారు. చారుగుండ్ల వెంకటసాయి అమృతవాగ్దేవి, మల్లెల్లి సాయి మానస, షేక్ నజహారత్, తడికమళ్ల పుష్పలత, తేజావత్ నందిని భాయ్ 9.55 ఎస్‌జీపీఏతో ద్వితీయ స్థానం సాధించారు.

*సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్)* విభాగంలో గూడూరు నాగిరెడ్డి, నూకఫణివెంకటసాయి శ్రీ అలేఖ్య, పదిర భార్గవి, పులికొండ తపస్వి, పప్పుల నాగం శివకుమార్ 9.55 ఎస్‌జీపీఏతో ప్రథమ స్థానంలో నిలిచారు. అన్నపురెడ్డి లహరి, చిరుమామిళ్ల వర్షిణి, పద్మనాభుని హేమలత, పెన్నాడ సాయి శ్రీజ, సారంగుల భార్గవి, సుంకర సాయి ప్రశాంతి 9.4 ఎస్‌జీపీఏతో ద్వితీయ స్థానం సాధించారు.

*ఏఐ అండ్ డీఎస్* విభాగంలో అడపా భరణి, పందిటి తేజశ్రీ, శీలం తేజశ్రీ 9.7 ఎస్‌జీపీఏతో ప్రథమ స్థానంలో నిలిచారు. చెన్ను సాయిమైథిలి, చిల్లపల్లి స్నేహ, గూడూరు కిషోర్ రెడ్డి, పాకలపాటి మానస 9.4 ఎస్‌జీపీఏతో ద్వితీయ స్థానం సాధించగా, పారేపల్లి శ్రీవిద్య 8.9 ఎస్‌జీపీఏతో తృతీయ స్థానం పొందింది.

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల కృషిని అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సెక్రటరీ దాసరి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.





# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**అశ్వారావుపేట, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ లబ్ధిదారులకు సూచించారు. అశ్వారావుపేట మండలంలో శనివారం విస్తృతంగా పర్యటించిన ఆయన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. గత ఏడాది మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మండలంలోని పాతరెడ్డిగూడెం గ్రామపంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి 100 శాతం ఇళ్ల మంజూరు జరిగిందన్నారు. అయితే కొందరు లబ్ధిదారులు అనివార్య కారణాలతో నిర్మాణాలు ప్రారంభించకపోవడం, మరికొన్ని చోట్ల పనులు నెమ్మదిగా సాగుతున్న నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. "ఇందిరమ్మ ఇల్లు ప్రతి పేద కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీక" అని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అధికారులు కూడా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సహకరించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, మాజీ మండల అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





# అరేపల్లెలో అగ్నిప్రమాదం కోటి రూపాయల నష్టం

**ఎల్కతుర్తి, మే 23 (తెలంగాణ ముచ్చట్లు)**: ఎల్కతుర్తి మండలం అరేపల్లె గ్రామంలో జరిగిన భారీ అగ్నిప్రమాదం స్థానిక రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. వరి కోతల అనంతరం మిగిలిన కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగి గాలి వేగానికి అదుపుతప్పి సమీపంలోని పంట పొలాలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో దాదాపు రెండెకరాల ప్లాంటేషన్ పూర్తిగా దగ్ధమైంది.

బాధిత రైతు మాటూరి విద్యాసాగర్, ఆయన తమ్ముడు అశోక్‌కు చెందిన ప్లాంటేషన్ మంటల్లో కాలిపోయినట్లు తెలిసింది. దాదాపు 20 సంవత్సరాల క్రితం పెంచిన చెట్లు క్షణాల్లో బూడిద కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. చెట్ల కటింగ్‌కు అనుమతి తీసుకునేందుకు ఫారెస్ట్ కార్యాలయానికి వెళ్లిన సమయంలోనే ఈ ప్రమాదం జరగడం బాధాకరమని విద్యాసాగర్ తెలిపారు.

మంటలు వ్యాపించే సమయంలో గడ్డివాము లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌కు కూడా మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. అరేపల్లెలో ప్రారంభమైన మంటల పొగ కమలాపూర్ మండలంలోని శంభునిపల్లి గ్రామం వరకు వ్యాపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సమయానికి స్పందించలేదని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో స్థానిక రైతులు, గ్రామ యువకులే స్వయంగా మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ ఘటనలో దాదాపు కోటి రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం తెలిపింది. నష్టపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకుని ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సలీం పాషా కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ప్రణవ్

**జమ్మికుంట టౌన్ మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తూ హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మహమ్మద్ సలీం పాషా కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని జమ్మికుంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు



భావోద్వేగానికి లోనుకాగా, కాంగ్రెస్ నాయకులు వారిని ఓదార్చారు. కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలిచే నాయకుడిగా ప్రణవ్ గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిగా భావిస్తూ, ఆపద సమయంలో పెద్ద దిక్కుగా నిలబడటం ప్రణవ్ నాయకత్వానికి నిదర్శనమని నాయకులు కొనియాడారు.

మాలో ఒకడిగా ఉన్న సలీం పాషా మృతి తీవ్ర విషాదకరమని, అలాంటి సమయంలో కుటుంబానికి భరోసా కల్పిస్తూ ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రణవ్ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భరత నాట్యానికే ఊపిరి మాధవరావు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం బ్యూరో, మే 23(తెలంగాణ ముచ్చట్లు ):** భరత నాట్యానికే ఊపిరి నటరాజ నృత్యా నికేతన్ చీఫ్ ఎస్ మాధవరావు అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగరంలో గల కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఉన్న ఏసీ పంక్షన్ హాల్ లో నటరాజ నృతానికేతన్ ఆధ్వర్యంలో యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తొలుత నూతి కాంగ్రెస్ నాయకులు




చల్లా ప్రతిభా రెడ్డి, బోజేడ్ల సత్యనారాయణ, గోపాల్, సీనియర్ జర్నలిస్టు మాధవరావు యెగినాటి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నేటి తరంలో భరతనాట్యం, కూచిపూడి,కటక్ లాంటి వాటిని మరిచిపోకుండా భవిష్యత్తు తరాలకు చెందిన చిన్నారులకు కళను వెలికి తీసి ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి మాధవరావు అని తెలిపారు. మాస్టర్ మాధవరావు వద్ద శిక్షణ పొందిన వేలాది మంది వివిధ విదేశాల్లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ మన దేశ చరిత్రను తిరగరాసే విధంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ నాయకురాలు చల్లా ప్రతిభా రెడ్డి మాట్లాడుతూ కళలకు సంబంధించి రానున్న రోజుల్లో కూడా మంచి గుర్తింపు ఉంటుంది అని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన చిన్నారులకు మోడల్, మెమోంటో లను బహుకరించారు. తొలుత చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి, కటక్ లాంటి నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

# జమ్మికుంట పరిధిలో మూడు వేర్వేరు ఘటనలు..
## బెదిరింపులు, దాడి, రోడ్డు ప్రమాదంపై కేసులు నమోదు

**జమ్మికుంట టౌన్ మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పరిధిలో శుక్రవారం మూడు వేర్వేరు ఘటనలకు సంబంధించి పోలీసులు కేసులు నమోదు చేశారు. రైతులకు నీరు రాకుండా తూము మూసివేయడం, జేసీబీ డబ్బుల వివాదంలో దాడి చేయడం, నిర్లక్ష్యంగా స్కూటీ నడపడంతో వృద్ధుడు గాయపడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. మొదటి ఘటనలో మడిపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల మల్లయ్య ఫిర్యాదు మేరకు, అదే గ్రామానికి చెందిన ఓ రవి రైతులకు వచ్చే తూమును సిమెంట్‌తో మూసివేసి నీరు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అలాగే నక్షా రోడ్డు లేకుండా రోడ్డును దున్నివేశాడని తెలిపారు. ఈ విషయమై ప్రశ్నించగా బూతులు తిట్టి చంపేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో ఘటనలో ధర్మాల గ్రామానికి చెందిన మేడి రామకృష్ణ ఫిర్యాదు మేరకు, 2022లో కలిసి కొనుగోలు చేసిన జేసీబీ ద్వారా వచ్చిన ఆదాయంలో తనకు వాటా ఇవ్వకుండా మేడి మహేందర్, మేడి రమేష్, మేడి సురేష్ మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయమై పెద్దమనుషుల వద్ద మాట్లాడినా పరిష్కారం కాలేదని తెలిపారు. అనంతరం ఈ నెల 20న ఫంక్షన్‌కి వెళ్లి వస్తుండగా తన బైక్‌ను అడ్డగించి బూతులు తిట్టి, కిందకు లాగి దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు తిప్పారపు రాజు, మారేపల్లి రాజేష్, గట్టు శ్రీను ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారని తెలిపారు. ఇక మరో ఘటనలో జమ్మికుంట సిఎస్ఐ చర్చి కాలనీకి చెందిన దుస్సా శంకరయ్య తన మనవడు అభిలాష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విజయ హాస్పిటల్ సమీపంలో బ్లూ కలర్ స్కూటీ అతివేగంగా వచ్చి ఢీకొట్టిందని ఫిర్యాదు చేశారు. ప్రమాదంలో శంకరయ్య నడుము భాగంలో ఫ్యాక్చర్‌తో పాటు రెండు కాళ్లకు గాయాలయ్యాయి. అనంతరం స్కూటీ నడిపిన వ్యక్తి నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రామిడి సాంబమూర్తి అని గుర్తించినట్లు తెలిపారు. ఈ మూడు ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక



## రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, మే 23(తెలంగాణ ముచ్చట్లు):** రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శనివారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను, సీజ్ చేసిన వాహనాలు, పరిసరాలను పరిశీలించారు. రానున్న ఎన్నికలకు క్షేత్రస్థాయిలో అవగాహన ఉండాలని సెక్టర్ పోలీస్ ఆఫీసర్లకు సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, పెండింగ్ కేసులు పరిశీలించారు. విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. పాత నేరస్థుల కదలికలను నిఘా పెట్టాలన్నారు.



## న్యాయం అడిగితే రైతులపై కేసులా..?

- మొక్కజొన్న కొనుగోలులో రాజకీయాలు.. రైతులను వేధిస్తున్న ప్రభుత్వం
- బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు ఆగ్రహం

**ఖమ్మం బ్యూరో , మే 23(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, "దున్నపోతు మీద వర్షం కురిసినట్లు" వ్యవహరిస్తోందని జడ్పీ మాజీ ఛైర్మన్, బిఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతకాని మండల రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల రోజులుగా మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు విషయంలో అధికారులు రాజకీయ ప్రభావానికి లోనై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పంట అమ్మకాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రైతులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు. కడుపుమంటతో రైతులు ఆందోళన చేపడితే అక్రమ కేసులు పెట్టడం రైతాంగాన్ని అణగదొక్కడమేనని విమర్శించారు. రైతులకు న్యాయం చేయకుండా కేసులతో బెదిరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులు బేషరతుగా ఉపసహరించాలని, లేనిపక్షంలో రైతాంగంతో కలిసి బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకటరామారావు, పొనుగోటి రత్నాకర్, గురజాల హనుమంతరావు, బొగ్గారపు రాంబాబు, గడ్డం శ్రీనివాసరావు, పిన్నెల్లి శ్రీనివాసరావు, చంద్రయ్య, చిట్టుమోదు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

- 233 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**హైదరాబాద్, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మొత్తం 233 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల కింద ఆర్థిక సహాయం అందించారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఈ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పెద్ద అండగా నిలుస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాలు సామాజిక భద్రతకు మంచి ఉదాహరణలని అన్నారు. పేదింటి పెళ్లిళ్లలో ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తులం బంగారం పథకాన్ని కూడా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పేద కుటుంబాలకు మరింత మేలు జరిగేలా సంక్షేమ కార్యక్రమాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో ఈ ఆర్థిక సహాయం తమకు ఎంతో ఉపయుక్తంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పేద కుటుంబాలకు ఊరట లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో పూల్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతాయని నాయకులు తెలిపారు.

## మండుటెండల్లో మానసిక రోగికి అండగా నిలిచిన జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ నాయకులు

**జమ్మికుంట టౌన్ మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** మండుటెండలు మండిపోతున్న వేళ... నీడలేని ఫ్లైఓవర్‌పై ఆకలితో, దాహంతో, మతిస్థిమితం కోల్పోయి రోజుల తరబడి జీవనం సాగిస్తున్న ఓ నిరాధార వ్యక్తిని చూసి జమ్మికుంటలో మానవత్వం మేల్కొంది. సమాజం పట్టించుకోని ఆ వ్యక్తికి ఆహారం, నీళ్లు అందిస్తూ జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ నాయకులు తమ పెద్ద మనసును చాటుకున్నారు.

అంతర్జాతీయ క్రీడాకారులు, జమ్మికుంట స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు వోజ్జ రాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) ఫ్లైఓవర్ వద్దకు వెళ్లి ఆ వ్యక్తికి భోజనం, నీటి బాటిళ్లు అందజేశారు. అతనితో మాట్లాడి వివరాలు తెలుసుకోగా... అతను జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికి చెందిన ప్రశాంత్ అని తెలిసింది.

కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ప్రశాంత్ ఫ్లైఓవర్‌పైనే రాత్రింబవళ్లు గడుపుతున్నాడని స్థానికులు తెలిపారు. మండుతున్న ఎండల్లోనూ, వర్షాల్లోనూ అక్కడే ఉండటం చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా రాజు, ప్రభు మాట్లాడుతూ... "ఒక మనిషి ఇలా రోడ్డుపై మానసిక రోగిగా జీవించడం చాలా బాధాకరం. అధికారులు వెంటనే స్పందించి అతని కుటుంబ సభ్యులను గుర్తించి, హైదరాబాద్ ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలి. సరైన వైద్యం అందితే ప్రశాంత్ మళ్లీ సాధారణ జీవితంలోకి రావచ్చు" అని విజ్ఞప్తి చేశారు.

జమ్మికుంట ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక చొరవ తీసుకొని ఒక నిండు ప్రాణాన్ని కాపాడాలని వారు కోరారు.

"మనిషిని మనిషిగా చూడటమే నిజమైన మానవత్వం" అని రాజు - ప్రభు చేసిన ఈ సహాయం స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది.



# పాలీసెట్‌లో సత్తుపల్లి విద్యార్థి స్టేట్ ఫస్ట్

- 120/120 మార్కులతో అర్ఫాజ్ అలీ ఘన విజయం.
- సత్తుపల్లి చరిత్రలో తొలిసారి రాష్ట్ర ప్రథమ స్థానం.

**సత్తుపల్లి, మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** పాలీసెట్-2026లో సత్తుపల్లి విద్యార్థి రాష్ట్ర ప్రథమ స్థానం సాధించి పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చాడు. పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయానికి చెందిన ఎం.డి. అర్ఫాజ్ అలీ 120కు 120 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్‌గా నిలిచాడు. సత్తుపల్లి చరిత్రలో పాలీసెట్‌లో రాష్ట్రస్థాయి తొలి ర్యాంకు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. అర్ఫాజ్ అలీ తండ్రి అఫ్జల్ జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యామండలి ఈ నెల 13న నిర్వహించిన పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలను శనివారం విడుదల చేసింది. ఇందులో అర్ఫాజ్ అలీ అన్ని విభాగాల్లో పూర్తి మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో పూర్తి స్థాయి మార్కులు సాధించి మొత్తం 120/120తో అగ్రస్థానంలో నిలిచాడు. విద్యార్థి విజయంపై సత్తుపల్లి ఎంఈవో రాజేశ్వరరావు అభినందనలు తెలిపారు. అర్ఫాజ్ అలీ మాట్లాడుతూ సమయపాలనతో చదవడం, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం, తల్లిదండ్రుల ప్రోత్సాహమే విజయానికి కారణమన్నారు. తన విజయానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో తోడ్పడిందని పేర్కొన్నారు. విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను కేవలం మార్కులకే పరిమితం చేయకుండా పోటీ పరీక్షల్లోనూ రాణించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రణాళికాబద్ధంగా బోధన నిర్వహిస్తున్నామన్నారు. ప్రాంతంలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. పాఠశాల యాజమాన్యం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అర్ఫాజ్ అలీని అభినందించారు.



## మండే ఎండలు మరో ప్రాణం తీశాయి.. జమ్మికుంటలో వడదెబ్బకు వృద్ధుడి మృతి

**జమ్మికుంట టౌన్ మే 23 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తుండగా, తీవ్ర ఎండలు మరో ప్రాణాన్ని బలితీసుకున్న విషాద ఘటన మోత్కులగూడెంలో చోటుచేసుకుంది. వడదెబ్బ కారణంగా వృద్ధుడు మృతి చెందడంతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని 11వ వార్డుకు చెందిన గల్లి లింగయ్య (65) శుక్రవారం పని నిమిత్తం మండుటెండలో మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురై పడుకున్నాడు. సాయంత్రం అయినా ఇంటి బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిశీలించగా ఆయన తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించగా అప్పటికే లింగయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఇటీవల మండుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.






## వాహనదారులకు శిక్ష/ జరిమానా విధించిన న్యాయస్థానం

**ఖమ్మం బ్యూరో, మే 23(తెలంగాణ ముచ్చట్లు ):** మద్యం మత్తులో వాహనం నడుపుతున్న వారిలో ఒకరికి ఏడు రోజుల శిక్ష, 11 మందికి 10,100/మరొకరికి 20,100/ రూపాయలు జరిమానా విధిస్తూ.. నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.నాగలక్ష్మి తీర్పు చెప్పారు. జైలు శిక్ష పడిన వ్యక్తిని ఖమ్మం జైలు కి తరలించడం జరిగిందని ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. ట్రాఫిక్ కోర్ట్ కానిస్టేబుల్ సతీష్‌ను ఇన్స్పెక్టర్ అభినందించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందన్నారు. భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రహదారి భద్రతకు సహకరించాలని పోలీసులు కోరారు.

# నేడే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష





**జిల్లావ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి**
**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**హనుమకొండ,మే 23,(తెలంగాణ ముచ్చట్లు):** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2026 నిర్వహణకు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోని ప్రతి గదిలో సదుపాయాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన మెటీరియల్‌ను పరిశీలించడంతో పాటు తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను తనిఖీ చేశారు. హాల్ టికెట్ నెంబరింగ్, ఇన్విజిలేటర్లు, రూట్ అధికారులు మరియు ఇతర సిబ్బంది విధులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారుజ్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం (24052026) రెండు సెషన్లలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2:30 గంటల నుండి 4:30 గంటల వరకు రెండో సెషన్ జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4,075 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేయబడతాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, గడియారాలు తీసుకురావద్దని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఫోటో గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశించే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పరీక్ష నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఫాతిమానగర్‌లోని సెయింట్ గాబ్రియల్ హై స్కూల్, హంటర్ రోడ్డులోని న్యూ సైన్స్ డిగ్రీ కాలేజ్, అడ్వకేట్స్ కాలనీలోని ఎస్సార్ నేషనల్ హై స్కూల్, వడ్డేపల్లిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ములుగు రోడ్డులోని శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, భద్రకాళి దేవాలయం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, లాల్ బహదూర్ కళాశాల మరియు అశోక జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు1ఈ కార్యక్రమంలో యూపీఎస్సీ సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ అధికారి శుభం గాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.ఎం. రెహమాన్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, రూట్ అధికారి భావ్ సింగ్ పాల్గొన్నారు.

# గోల్డెన్ సిటీ జైసల్మేర్‌లో నీటి కష్టాలు





- పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల ఆందోళన
- ఎండల తీవ్రతతో నీటి కోసం అల్లాడుతున్న ప్రజలు

రాజస్థాన్ రాష్ట్రంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన జైసల్మేర్ తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గోల్డెన్ సిటీగా పేరుగాంచిన ఈ ఎడారి నగరంలో గత పది రోజులుగా నల్లాల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండిపోతున్న ఎండలు, వడగాలులు మధ్య నీటి కొరత ప్రజల జీవనాన్ని మరింత కష్టతరం చేసింది. జైసల్మేర్‌లో ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఎడారి ప్రాంతం కావడంతో వేడి తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో తాగునీరు అందకపోవడంతో ప్రజలు నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. మున్సిపల్ ట్యాంకర్లు నాలుగు నుంచి ఐదు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు సరఫరా చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటి సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఈ పరిస్థితిపై రాజస్థాన్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు స్పందించారు. స్థానిక కాలువకు సంబంధించిన నిర్వహణ పనుల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, అందువల్ల నల్లాల ద్వారా నీరు సరఫరా చేయలేకపోతున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిరంజన మీనా వెల్లడించారు. ప్రస్తుతం నగరంలోని ఏడు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరో మూడు రోజుల్లో నల్లాల ద్వారా సాధారణ నీటి సరఫరా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పరిస్థితి ఇంత దారుణంగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నీటి కొరత సమస్య మళ్లీ రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# యువ వాలీబాల్ క్రీడాకారుడి దారుణ హత్య






- మైనర్ బాలిక కుటుంబ సభ్యులపై హత్య ఆరోపణలు
- మూడు రోజులపాటు చిత్రహింసలు..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

మైనర్ బాలికతో ప్రేమ వ్యవహారం కారణంగా యువ వాలీబాల్ క్రీడాకారుడు దారుణ హత్యకు గురైన ఘటన హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో కలకలం రేపింది. రాజస్థాన్‌కు చెందిన 21 ఏళ్ల వాలీబాల్ క్రీడాకారుడు మోను మృతి చెందగా, ఈ ఘటనపై పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మోను ఫరీదాబాద్‌కు చెందిన ఓ మైనర్ బాలికతో ప్రేమలో ఉన్నాడు. ఈ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలిసిన తర్వాత గత ఏప్రిల్‌లో బాలిక కిడ్నాప్ కేసులో మోనుపై ఫిర్యాదు నమోదైంది. అప్పటి నుంచి ఈ వ్యవహారం ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం. మే 17న పోలీసు విచారణకు హాజరుకావడానికి బయలుదేరిన మోనును మార్గమధ్యంలోనే బాలిక కుటుంబ సభ్యులు కిడ్నాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఓ ఇంట్లో బంధించి మూడు రోజులపాటు అన్నం, నీళ్లు ఇవ్వకుండా తీవ్రంగా హింసించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాళ్లు, చేతులు కట్టేసి ఇనుపరాడ్లతో దారుణంగా కొట్టినట్లు ఆరోపిస్తున్నారు.

తీవ్రంగా గాయపడిన మోనును మే 20న రోడ్డుపై పడేసి నిందితులు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మోను మృతి చెందాడు. యువ క్రీడాకారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫరీదాబాద్ పోలీసులు కిడ్నాప్, హత్య కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఇద్దరు ప్రధాన అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ ఘటనపై స్థానిక క్రీడా సంఘాలు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రేమ వ్యవహారం పేరుతో యువ క్రీడాకారుడిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేయడం అమానుషమని మండిపడుతున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# లడాఖ్‌లో కుప్పకూలిన ఆర్మీ చాపర్

- తృటిలో ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు సైన్యాధికారులు
- ప్రమాద స్థలంలో సెల్ఫీ దిగిన మేజర్ జనరల్



లడాఖ్‌లో భారత సైన్యానికి చెందిన చీతా హెలికాప్టర్ కూలిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లేహ్ సమీపంలోని తంగ్సే ప్రాంతంలో మే 20న ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తాజాగా ధృవీకరించారు. ఈ ప్రమాదంలో ముగ్గురు ఉన్నతస్థాయి సైన్యాధికారులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. సైన్యాధికారుల వివరాల ప్రకారం.. కూలిన హెలికాప్టర్‌లో లెఫ్టినెంట్ కల్నల్, ఓ మేజర్ పైలెట్‌తో పాటు 3వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌కు చెందిన మేజర్ జనరల్ సచిన్ మెహతా ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో ముగ్గురికీ గాయాలైనప్పటికీ ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం అనంతరం కూలిపోయిన హెలికాప్టర్ వద్ద మేజర్ జనరల్ సచిన్ మెహతా దిగిన సెల్ఫీ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కొండ ప్రాంతంలోని రాళ్ల మధ్య కూలిపోయిన హెలికాప్టర్ పక్కన కూర్చుని తీసుకున్న ఆ ఫోటో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. తీవ్ర ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడటాన్ని చాలామంది అద్భుతంగా అభివర్ణిస్తున్నారు. లడాఖ్ వంటి ఎత్తైన పర్వత ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు తరచూ మారుతూ ఉంటాయని, అలాంటి పరిస్థితుల్లో పాత చీతా హెలికాప్టర్లు సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సమాచారం. ఈ ఘటనపై సైన్యం అధికారిక దర్యాప్తుకు ఆదేశించింది. చీతా హెలికాప్టర్లను భారత సైన్యం 1970 దశకంలో వినియోగంలోకి తీసుకువచ్చింది. 1984లో జరిగిన ఆపరేషన్ మేఘదూత్ సమయంలో సియాచిన్ గ్లేసియర్ ప్రాంతంలో ఈ హెలికాప్టర్లు కీలక పాత్ర పోషించాయి. ఎత్తైన ప్రాంతాల్లో ప్రయాణాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ హెలికాప్టర్లలో ఐదుగురు వరకు ప్రయాణించవచ్చు. అయితే గతంలో కూడా చీతా హెలికాప్టర్లు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యాయి. ఈ ప్రమాదాల్లో పలువురు పైలెట్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజా ఘటనతో మరోసారి చీతా హెలికాప్టర్ల భద్రతపై చర్చ మొదలైంది.

# దేశంలో నకిలీ లాయర్ల కలకలం




- 40 శాతం వరకు నకిలీ న్యాయవాదులే
- బార్ కౌన్సిల్ సంచలన వ్యాఖ్యలు

దేశవ్యాప్తంగా కోర్టుల్లో నల్ల కోట్లు వేసుకుని ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదుల్లో భారీ సంఖ్యలో నకిలీ లాయర్లు ఉన్నారంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశంలో దాదాపు 35 నుంచి 40 శాతం వరకు న్యాయవాదులు నకిలీ సర్టిఫికెట్లతో కోర్టుల్లో వాదనలు వినిపిస్తున్నారని బీసీఐ ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా వెల్లడించారు. నకిలీ డిగ్రీలను కొనుగోలు చేయడం లేదా తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించడం ద్వారా పలువురు కోర్టుల్లో న్యాయవాదులుగా కొనసాగుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారం బార్ కౌన్సిల్ దృష్టికి వచ్చిందని, ఇప్పటికే దీనిపై ప్రత్యేక చర్యలు ప్రారంభించామని తెలిపారు. నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అరికట్టేందుకు బీసీఐ దేశవ్యాప్తంగా న్యాయవాదుల విద్యార్హతల పరిశీలన చేపట్టింది. అడ్వకేట్ల డిగ్రీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఫారాలు సమర్పించాలని కోరగా, దాదాపు 40 శాతం మంది ఇప్పటివరకు వెరిఫికేషన్ ఫారాలు నింపలేదని వెల్లడించారు. ఫారాలు సమర్పించని వారిపై బీసీఐ అనుమానం వ్యక్తం చేస్తోంది.

ఈ అంశాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ కుమార్ మిశ్రా తెలిపారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతకు భంగం కలిగించే ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన "కాక్రోచ్ జనతా పార్టీ" వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. గత వారం ఒక పిటిషన్ విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కొందరు నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్నారని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. అలాంటి వారినే ఉద్దేశిస్తూ "కాక్రోచ్" అనే పదాన్ని ఉపయోగించారని స్పష్టం చేశారు. నకిలీ డిగ్రీల వ్యవహారంపై అవసరమైతే సీబీఐ దర్యాప్తు కూడా కోరే అవకాశముందని బీసీఐ వర్గాలు సూచిస్తున్నాయి. న్యాయవృత్తి పవిత్రతను కాపాడేందుకు కఠిన చర్యలు తప్పవని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


# ట్రంప్‌ను ఎగతాళి చేసిన ఇరాన్





అమెరికా-ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఇరాన్ మరోసారి అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యంగ్య పోస్టుతో వార్తల్లో నిలిచింది. బంగ్లాదేశ్‌లో ట్రంప్‌ను పోలి ఉన్న తెల్ల దున్నపోతుకు సంబంధించిన వీడియోను రష్యాలోని ఇరాన్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో షేర్ చేస్తూ ఎగతాళి చేసింది. "ట్రంప్‌తో పోల్చడం వల్ల మన స్తాపానికి గురైన ఆ మూగజీవం ప్రస్తుతం తిండి తినడం మానేసింది" అంటూ ఇరాన్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ పోస్టుపై ప్రపంచవ్యాప్తంగా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. బంగ్లాదేశ్‌లోని నారాయణ్‌గంజ్ జిల్లాకు చెందిన ఈ భారీ తెల్ల దున్నపోతు ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. సుమారు 700 కిలోల బరువున్న ఈ దున్నపోతు తలపై ఉన్న జుట్టు, ముఖ ఆకృతి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను పోలి ఉన్నాయని పలువురు నెటిజన్లు కామెంట్లు చేశారు. దీంతో దాని యజమాని సరదాగా ఆ దున్నపోతుకు "డొనాల్డ్ ట్రంప్" అని పేరు పెట్టాడు. ప్రస్తుతం బక్రీద్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ఈ దున్నపోతును చూడటానికి ప్రజలు భారీగా తరలివస్తున్నారు. సెల్ఫీలు దిగుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ బక్రీద్ సందర్భంగా దాన్ని బలివ్వాల్సి వస్తుందని యజమాని చెప్పడం పలువురిని నిరాశకు గురిచేస్తోంది. ఈ ఘటన అంతర్జాతీయ రాజకీయాల మధ్య మరోసారి సోషల్ మీడియా చర్చకు దారితీసింది.

# రోడ్లపై నమాజ్ నిషేధానికి కేంద్ర మంత్రి మద్దతు



బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై నమాజ్ నిర్వహణను నిషేధిస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పూర్తి మద్దతు ప్రకటించారు. మతపరమైన కార్యక్రమాల సమయంలో శాంతిభద్రతలను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ప్రత్యేకంగా అభినందించారు. దేశంలో కొందరు కావాలనే ఉద్రిక్త వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. ప్రజల సౌకర్యం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి నిబంధనలు తీసుకురావడం అవసరమని చెప్పారు. ఇలాంటి చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇరాన్, అరబ్ దేశాల్లో కూడా వీధుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించరని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ఈ నిబంధనలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు.

పండుగల పేరుతో గోవధ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో బలులు ఇవ్వడంపై కూడా కేంద్ర మంత్రి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అనేక ముస్లిం దేశాల్లో కూడా ఇలాంటి పద్ధతులు కనిపించవని అన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీయడం కోసం కొందరు ఉద్దేశపూర్వకంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌లో కూడా హిందువులు గోవులను పూజిస్తారని పేర్కొంటూ మతసామరస్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై దేశవ్యాప్తంగా రాజకీయ చర్చ కొనసాగుతోంది. కొందరు ఈ నిర్ణయాన్ని సమర్థిస్తుండగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# అమెజాన్‌లో 100కు పైగా కొత్త బ్యూటీ బ్రాండ్లు

భారత ఈకామర్స్ రంగంలో అగ్రగామి సంస్థ అమెజాన్ ఇండియా తన సౌందర్య ఉత్పత్తుల విభాగాన్ని మరింత విస్తరించేందుకు భారీ ప్రణాళికలు రూపొందించింది. దేశంలో ప్రీమియం బ్యూటీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 2026 సంవత్సరంలో 100కు పైగా అంతర్జాతీయ, ప్రీమియం బ్రాండ్లను తమ వేదికలో ప్రవేశపెట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది.

ఈ కొత్త జాబితాలో ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లు అయిన డోల్సె అండ్ గబ్బానా, లారా మెర్సియర్, ఎలెమిస్, అర్బన్ డీకే, అవెడా, లా రోష్ పోసే వంటి ప్రముఖ సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్లు ఉండనున్నాయి. అమెరికా, యూరప్ దేశాలకు చెందిన ఉత్పత్తులతో పాటు జపాన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల ప్రత్యేక చర్మ సంరక్షణ ఉత్పత్తులను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

మధ్యప్రాచ్య దేశాలకు చెందిన ఊద్, అత్తర్ వంటి ప్రీమియం సుగంధ ద్రవ్య బ్రాండ్లను కూడా అమెజాన్ తన వేదికలో అందించనుంది. రాబోయే జూలై నెల 'ప్రైమ్ డే' అమ్మకాల సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లు, భారీ తగ్గింపులు, ప్రత్యేక ప్రారంభ విక్రయాలు నిర్వహించనున్నట్లు సంస్థ వెల్లడించింది.

ఈ నివేదికలో ఆసక్తికర అంశం ఏమిటంటే ప్రీమియం సౌందర్య ఉత్పత్తుల కొనుగోళ్లలో సగానికి పైగా డిమాండ్ ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచే వస్తోంది. త్రిస్సూర్, డెహ్రాడూన్, పాటియాలా, గౌహతి, కొల్హాపూర్ వంటి నగరాల్లో ప్రీమియం బ్యూటీ ఉత్పత్తుల వినియోగం గణనీయంగా పెరుగుతున్నట్లు అమెజాన్ తెలిపింది.

కొరియన్ చర్మ సంరక్షణ ఉత్పత్తులు, ఫ్రెంచ్ ఫార్మసీ బ్రాండ్లకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తోందని సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా పురుషుల ప్రీమియం గ్రూమింగ్ విభాగం ఏటా రెండున్నర రెట్లు వృద్ధి నమోదు చేస్తోందని పేర్కొంది.

వినియోగదారుల షాపింగ్ అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు అమెజాన్ అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను కూడా వినియోగిస్తోంది. 'రూఫస్' అనే జనరేటివ్ ఏఐ షాపింగ్ అసిస్టెంట్, 'అమెజాన్ లెన్స్' వంటి సాంకేతికతల ద్వారా వినియోగదారులు తమ చర్మ తత్వానికి సరిపోయే ఉత్పత్తులను సులభంగా ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తోంది.

అదే సమయంలో డెలివరీ వ్యవస్థను కూడా సంస్థ బలోపేతం చేసింది. దేశంలోని టాప్ 100 నగరాల్లో సగానికి పైగా బ్యూటీ ఆర్డర్‌లను అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ చేసేలా లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు అమెజాన్ వెల్లడించింది.

# ప్రెగాబాలిన్‌పై కేంద్రం కఠిన ఆంక్షలు




నరాల సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక నొప్పుల చికిత్సలో విస్తృతంగా ఉపయోగించే ప్రెగాబాలిన్ మందుపై కేంద్ర ఆరోగ్య శాఖ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ మందును కొందరు దుర్వినియోగం చేస్తున్నారనే ఆందోళనల నేపథ్యంలో ప్రెగాబాలిన్‌ను కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ హెచ్ 1 జాబితాలో చేర్చింది. ఈ నిర్ణయం ప్రకారం ఇకపై ప్రెగాబాలిన్ మందును కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా వైద్యుల చిట్టీ అవసరం ఉంటుంది. ఫార్మసీలు ఆ ప్రిస్క్రిప్షన్ ప్రతిని తమ వద్ద భద్రపరచడంతో పాటు, మందు వినియోగదారుల వివరాలను కనీసం మూడు సంవత్సరాల పాటు నమోదు చేసి ఉంచాలని కేంద్రం తన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ప్రెగాబాలిన్ ట్యాబ్లెట్ల వినియోగంపై పలు రాష్ట్రాలు ఇటీవల ఆందోళనలు వ్యక్తం చేశాయి. ముఖ్యంగా యువత ఈ మందును మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు వచ్చిన నివేదికలు కేంద్రాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో అమ్మకాలపై కఠిన నియంత్రణలు అవసరమని ఆరోగ్య శాఖ భావించింది. ప్రభుత్వం ప్రకారం ఈ నిర్ణయం వల్ల మందు సరైన రీతిలో వినియోగించబడటంతో పాటు అక్రమ అమ్మకాలు, దుర్వినియోగాన్ని నియంత్రించవచ్చని భావిస్తున్నారు. డ్రగ్ దుర్వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను నివారించడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రెగాబాలిన్ మందును ప్రధానంగా న్యూరోపథీ, ఫైబ్రోమయాల్జియా, దీర్ఘకాలిక నొప్పులు, నరాల సంబంధిత సమస్యల చికిత్సలో వైద్యులు సూచిస్తుంటారు. అయితే మార్కెట్లో ఈ మందుకు భారీ డిమాండ్ ఉండటంతో కొందరు దాన్ని తప్పుగా వినియోగిస్తున్నట్లు ఆరోగ్య శాఖ గుర్తించింది. దేశవ్యాప్తంగా అక్రమంగా ప్రెగాబాలిన్ విక్రయాలు జరుగుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో ఇకపై ఈ మందు ప్యాకెట్లపై 'షెడ్యూల్ హెచ్ 1 హెచ్చరిక' తప్పనిసరిగా ముద్రించాలని తయారీ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం షెడ్యూల్ హెచ్‌లో ఉన్న ఈ మందును హెచ్ 1 కేటగిరీకి మార్చడంతో నియంత్రణ మరింత కఠినమైంది. షెడ్యూల్ హెచ్ 1 జాబితాలో సాధారణంగా బలమైన యాంటీబయాటిక్స్, క్షయవ్యాధి మందులు, అలవాటు పడే ప్రమాదం ఉన్న ఔషధాలు ఉంటాయి. 2022లో పశ్చిమ పంజాబ్ ప్రాంతంలో నిర్వహించిన అధ్యయనంలో యువతలో ప్రెగాబాలిన్ దుర్వినియోగం పెరుగుతున్నట్లు వెల్లడైన విషయం తెలిసిందే. దీంతో ఈ మందుపై కఠిన నిఘా అవసరమని నిపుణులు సూచించారు.

# ఇంధన ధరల మోత.. సామాన్యుడిపై మరో భారం

దేశవ్యాప్తంగా వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి భారీ షాక్ ఇచ్చింది. ఇప్పటికే గత కొన్ని రోజుల వ్యవధిలోనే రెండుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన చమురు సంస్థలు.. తాజాగా మూడోసారి కూడా రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. తాజా పెంపుతో లీటర్ పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు అదనంగా పెరిగాయి. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. వరుస ధరల పెంపులతో సామాన్య ప్రజలపై మరింత ఆర్థిక భారం పడనుంది.

గతంలో లీటరు పెట్రోల్‌పై మూడు రూపాయలు పెంచిన చమురు సంస్థలు.. ఆ తర్వాత మరో విడతలో 90 పైసలు పెంచాయి. ఇప్పుడు మూడోసారి కూడా ధరలు పెంచడంతో దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థలు గత నాలుగేళ్లుగా భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయని కేంద్రం పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా ఈ పెంపుకు ప్రధాన కారణాలుగా వెల్లడించింది. భారతదేశం తన అవసరాల్లో ఎక్కువ భాగం ముడిచమురును విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుండటంతో అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం నేరుగా దేశీయ ధరలపై పడుతోంది. తాజా ధరల పెంపుతో కేవలం వాహనదారులకే కాకుండా సాధారణ ప్రజలందరికీ ప్రభావం పడనుంది. ముఖ్యంగా డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగే అవకాశముంది. దీని ప్రభావం కూరగాయలు, పాలు, పప్పుధాన్యాలు, నిత్యావసర సరుకుల ధరలపై పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రవాణా ఛార్జీలు పెరగడం వల్ల మార్కెట్‌లో సరుకుల ధరలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తాజా పెంపు తర్వాత హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.112.71కు చేరుకోగా, డీజిల్ ధర రూ.100.86గా నమోదైంది. విజయవాడలో పెట్రోల్ ధర రూ.113.95, డీజిల్ ధర రూ.101.11కు చేరుకుంది. ఢిల్లీలో పెట్రోల్ రూ.99.51, డీజిల్ రూ.92.49గా ఉంది. ముంబైలో పెట్రోల్ రూ.108.46, డీజిల్ రూ.94.99గా నమోదైంది. బెంగళూరులో పెట్రోల్ రూ.108.02, డీజిల్ రూ.95.95గా ఉండగా, కోల్‌కతాలో పెట్రోల్ రూ.110.57, డీజిల్ రూ.96.98కు చేరాయి. చెన్నైలో పెట్రోల్ రూ.105.38, డీజిల్ రూ.97.02గా కొనసాగుతున్నాయి.




# రూ.10 వేలలోపు కొత్త 5జీ ఫోన్

భారత మార్కెట్లో బడ్జెట్ ధరలో కొత్త 5జీ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేస్తూ హెచ్‌ఎండీ గ్లోబల్ సంస్థ 'హెచ్‌ఎండీ వైబ్ 2 5జీ' మొబైల్‌ను అధికారికంగా ఆవిష్కరించింది. తక్కువ ధరలో భారీ బ్యాటరీ, స్మూత్ డిస్‌ప్లే, తాజా సాఫ్ట్‌వేర్ అనుభూతి కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చారు. బ్యాంక్ ఆఫర్లతో కలిపి ఈ ఫోన్ ప్రారంభ ధరను రూ.9,499గా నిర్ణయించారు. సాధారణ ధర రూ.10,999గా ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్ మే 26 మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రముఖ ఈ-కామర్స్ వేదిక ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయాలకు అందుబాటులోకి రానుంది. కాస్మిక్ లావెండర్, నార్డిక్ బ్లూ, పీచ్ పింక్ రంగుల్లో ఈ ఫోన్ లభించనుంది. ఈ ఫోన్ ప్రత్యేకతల్లో ముఖ్యమైనది సరికొత్త ఆండ్రాయిడ్ 16 ఆపరేటింగ్ సిస్టమ్‌తో రావడం. అలాగే అనవసర యాప్‌లు లేకుండా క్లీన్ యూజర్ అనుభూతిని అందించనుంది. భారతీయ వినియోగదారుల కోసం రూపొందించిన 'ఇండస్ ఏఐ' సహాయక వ్యవస్థను కలిగిన తొలి ఫోన్ ఇదేనని సంస్థ తెలిపింది. 'సర్వం ఏఐ' రూపొందించిన ఈ సాంకేతికత తెలుగుతో పాటు 22 భారతీయ భాషలను, ప్రాంతీయ యాసలను కూడా సులభంగా అర్థం చేసుకోగలదని కంపెనీ వెల్లడించింది. ఫోన్‌లో 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌తో కూడిన 6.74 అంగుళాల హెచ్‌డీ ప్లస్ ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లేను అందించారు. 500 నిట్స్ బ్రైట్‌నెస్‌తో స్క్రీన్ మరింత స్పష్టమైన విజువల్స్‌ను అందించనుంది. ఆక్టా కోర్ యూనిసోక్ టీ8200 చిప్‌సెట్‌తో ఈ ఫోన్ పనిచేస్తుంది. 4జీబీ ర్యామ్‌తో పాటు 64జీబీ, 128జీబీ స్టోరేజ్ వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. మైక్రో ఎస్‌డీ కార్డ్ ద్వారా 512జీబీ వరకు మెమరీని పెంచుకునే అవకాశం ఉంది. ఫోటోగ్రఫీ కోసం వెనుక భాగంలో 50 మెగాపిక్సెల్ ఏఐ డ్యూయల్ కెమెరా సెటప్‌ను అందించగా, సెల్ఫీల కోసం ముందు భాగంలో 8 మెగాపిక్సెల్ కెమెరా ఉంది. భారీ 6000 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫోన్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. 18 వాట్ల ఫాస్ట్ ఛార్జింగ్‌కు ఇది మద్దతు ఇస్తుంది. ముఖ్యంగా ఛార్జర్‌ను కూడా బాక్స్‌లోనే అందిస్తున్నారు. ధూళి, నీటి చినుకుల నుంచి రక్షణ కోసం ఐపీ64 రేటింగ్ ఇచ్చారు. అలాగే సైడ్ మౌంటెడ్ ఫింగర్‌ప్రింట్ స్కానర్, ఫేస్ అన్‌లాక్ వంటి భద్రతా ఫీచర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ 'సంచార్ సాథి' టెలికాం భద్రతా ఫీచర్ల మద్దతుతో వస్తున్న ఈ ఫోన్, రూ.10 వేల లోపు ధరలో 4జీ నుంచి 5జీకి అప్‌గ్రేడ్ కావాలనుకునే వినియోగదారులకు మంచి ఎంపికగా నిలుస్తుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
ఆదివారం - 24 - మే 2026





# ఎండిపోతున్న నదులు.. రగులుతున్న ఉద్రిక్తతలు

నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు?

ప్రపంచాన్ని వెంటాడుతున్న నీటి సంక్షోభం

నదుల కోసం పెరుగుతున్న ఘర్షణలు

రాబోయే కాలంలో నీరే అత్యంత విలువైన సంపదగా మారుతుందా?

ఒకప్పుడు ప్రపంచ దేశాలు చమురు కోసం పోటీ పడ్డాయి. ఇప్పుడు అదే పరిస్థితి నీటి విషయంలో కనిపిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తగ్గుతున్న వర్షపాతం, ఎండిపోతున్న నదులు, క్షీణిస్తున్న భూగర్భ జలాలు కలిసి ప్రపంచాన్ని తీవ్రమైన నీటి సంక్షోభం వైపు నెట్టేస్తున్నాయి. ఒకప్పుడు కేవలం హెచ్చరికలా వినిపించిన "నీటి యుద్ధాలు" అనే మాట ఇప్పుడు నిజమయ్యేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో తాగునీటి కొరత పెరుగుతుండగా ప్రజలు రోజురోజుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారత్, పాకిస్థాన్ మధ్య సింధు నదీ జలాల వివాదం ఇప్పటికే ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. వాతావరణ మార్పులు, తగ్గుతున్న నదీ ప్రవాహాలు, ఆనకట్టల నిర్మాణం కారణంగా జల వివాదాలు మరింత తీవ్రమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కూడా ఇలాంటి సమస్యలు పెరుగుతున్నాయి. కొన్ని దేశాల్లో నదుల వినియోగంపై రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాపై ప్రజల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. నీరు ఇప్పుడు కేవలం అవసరం మాత్రమే కాదు, వ్యూహాత్మక సంపదగా మారుతోంది.

భారతదేశంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపిస్తోంది. వేసవికాలంలో అనేక గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బోర్లు ఎండిపోవడం, చెరువులు మాయమవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నీటి ట్యాంకర్ల కోసం గొడవలు కూడా జరుగుతున్నాయి. రాబోయే కాలంలో నీటి కొరత మరింత పెరిగితే సామాజిక ఉద్రిక్తతలు కూడా పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యవసాయం ప్రపంచంలోనే అత్యధిక నీటిని వినియోగించే రంగంగా ఉంది. జనాభా పెరుగుతున్న కొద్దీ ఆహార అవసరాలు పెరుగుతున్నాయి. కానీ నీటి లభ్యత మాత్రం తగ్గిపోతోంది. హిమనదాలు కరుగుతుండటం, వర్షాలు అస్థిరంగా మారడం, అడవులు తగ్గిపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. ఒక ప్రాంతంలో వరదలు వస్తే, మరో ప్రాంతం కరువుతో అల్లాడుతోంది. ఈ మార్పులు భవిష్యత్తులో ప్రపంచ ఆహార భద్రతపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇప్పుడు అయినా ప్రపంచ దేశాలు మేల్కొనాల్సిన అవసరం ఉంది. వర్షపు నీటి సంరక్షణ, చెట్ల పెంపకం, నీటి వృథాను తగ్గించడం, చెరువులు, నదులను కాపాడడం వంటి చర్యలు అత్యవసరంగా మారాయి. లేకపోతే రాబోయే తరాలు చమురు కోసం కాదు, ఒక బిందె నీటి కోసం పోరాడే పరిస్థితులు రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే అనే విషయాన్ని ప్రపంచం ఇప్పటికైనా గుర్తించాల్సిన సమయం వచ్చింది.

# సోదర బంధానికి ప్రతీకగా సోదరుల దినోత్సవం




- అన్నదమ్ముల ప్రేమను గుర్తు చేసే ప్రత్యేక సందర్భం
- చిన్ననాటి జ్ఞాపకాలను మళ్లీ తలపించే రోజు
- కుటుంబ అనుబంధాలను మరింత బలపరిచే ఆప్యాయత వేడుక

ప్రతి కుటుంబంలో అత్యంత మధురమైన బంధాల్లో సోదర బంధం ఒకటి. ఒకే ఇంట్లో పెరిగి, ఒకే తల్లిదండ్రుల ప్రేమను పంచుకుంటూ ఎదిగే అన్నదమ్ముల అనుబంధం జీవితాంతం నిలిచే ఆప్యాయతగా మారుతుంది. అలాంటి బంధాన్ని గుర్తు చేసుకునే రోజుగా సోదరుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ రోజు కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలను మరింత దగ్గర చేస్తుంది. చిన్ననాటి నుంచి అన్న లేదా తమ్ముడు మన జీవితంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదిస్తాడు. ఆటల్లో భాగస్వామి, చదువుల్లో తోడు, తప్పు చేస్తే మందలించే వ్యక్తి, బాధలో ఓదార్పు చెప్పే మనిషిగా సోదరుడు నిలుస్తాడు. బాల్యంలో జరిగే చిన్నచిన్న గొడవలు కూడా తరువాత అందమైన జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. కుటుంబంలో సోదరులు ఉండటం అనేది ఒక భరోసా లాంటిదని పెద్దలు చెబుతుంటారు. జీవితంలో ఎలాంటి సమస్య వచ్చినా ముందుగా గుర్తుకొచ్చే వ్యక్తుల్లో సోదరుడు కూడా ఉంటాడు. ఎన్నో సందర్భాల్లో మాటలకంటే ఎక్కువగా అర్థం చేసుకునే బంధంగా ఇది నిలుస్తుంది. అందుకే ఈ అనుబంధానికి ప్రత్యేక గుర్తింపుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం మారుతున్న జీవనశైలితో కుటుంబ సభ్యులు వేర్వేరు ప్రాంతాల్లో నివసించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉద్యోగాలు, విద్య, వ్యాపారాల కారణంగా అన్నదమ్ములు దూరంగా ఉన్నప్పటికీ మనసులు మాత్రం ఎప్పటికీ దగ్గరగానే ఉంటాయి. ఒక చిన్న పలకరింపు, ఒక ఆప్యాయమైన సందేశం కూడా ఈ బంధాన్ని మరింత బలపరుస్తుంది. సామాజిక మాధ్యమాల విస్తరణతో ఇప్పుడు ఈ దినోత్సవానికి మరింత ప్రాధాన్యం పెరిగింది. చాలామంది తమ చిన్ననాటి చిత్రాలను పంచుకుంటూ సోదరులపై ఉన్న ప్రేమను వ్యక్తం చేస్తున్నారు. కొందరు ప్రత్యేక కానుకలు అందిస్తుండగా, మరికొందరు కలిసి గడిపే సమయాన్నే గొప్ప బహుమతిగా భావిస్తున్నారు.

సోదర బంధం కేవలం కుటుంబ పరిమితుల్లోనే కాదు, వ్యక్తిత్వ వికాసంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తుంది. చిన్నప్పటి నుంచి కలిసి పెరగడం వల్ల పరస్పర సహకారం, బాధ్యత, గౌరవం వంటి విలువలు సహజంగానే అలవడతాయి. ఒకరికొకరు ధైర్యం చెప్పుకుంటూ జీవితంలో ముందుకు సాగుతారు. చాలా సందర్భాల్లో తల్లిదండ్రులు లేని సమయంలో కుటుంబ బాధ్యతలను అన్నదమ్ములే పంచుకుంటారు. కష్టసమయాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ కుటుంబాన్ని కాపాడే శక్తిగా మారుతారు. అందుకే సోదర బంధాన్ని సమాజంలో అత్యంత విలువైన సంబంధాల్లో ఒకటిగా భావిస్తారు.

పిల్లల పెంపకంలో కూడా సోదర బంధం ఎంతో ప్రభావం చూపుతుంది. ఒంటరితనం తగ్గి, పంచుకోవడం అనే గుణం పెరుగుతుంది. చిన్నతనంలో కలిసి గడిపిన సమయం తరువాత జీవితంలో మధుర జ్ఞాపకాలుగా నిలుస్తుంది. అందుకే చాలామంది తమ బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ ఈ రోజును ఆనందంగా జరుపుకుంటారు. మన సంస్కృతిలో కుటుంబ బంధాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పెద్దలను గౌరవించడం, చిన్నవారిని ప్రేమించడం వంటి విలువలు కుటుంబాల ద్వారా తరతరాలకు చేరుతున్నాయి. అందులో సోదరుల అనుబంధం కూడా ముఖ్యమైనదే. ప్రేమ, నమ్మకం, సహకారం అనే భావాలను ఈ బంధం ప్రతిబింబిస్తుంది. ప్రపంచం ఎంత వేగంగా మారినా కుటుంబ బంధాల విలువ మాత్రం ఎప్పటికీ తగ్గదు. జీవిత ప్రయాణంలో ఎన్నో మార్పులు వచ్చినా సోదరుల మధ్య ఉన్న ఆప్యాయత చిరస్థాయిగా నిలుస్తుంది. అలాంటి అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేమను పంచుకునే రోజుగా సోదరుల దినోత్సవం ప్రతి కుటుంబానికి ప్రత్యేకతను తీసుకొస్తోంది.



ఆదివారం - 24 - మే 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# 'సలార్ 2'పై ప్రశాంత్ నీల్ క్లారిటీ

రెబల్ స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సలార్ పార్ట్2' సినిమాపై దర్శకుడు ప్రశాంత్ నీల్ కీలక స్పష్టత ఇచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా ఈ సినిమా ఆగిపోయిందనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజా సమాచారం అభిమానుల్లో మళ్లీ ఉత్సాహాన్ని నింపింది.

'సలార్ పార్ట్1' విడుదల సమయంలోనే చిత్రబృందం రెండో భాగం కూడా ఉంటుందని ప్రకటించింది. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం భారీ యాక్షన్ సన్నివేశాలు, భావోద్వేగ కథనం, అద్భుత దృశ్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఖాన్సార్ సామ్రాజ్యం నేపథ్యంలో దేవ, వరదరాజ మన్నార్ పాత్రల చుట్టూ నడిచిన కథ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది.

అయితే ఇటీవల దర్శకుడు ప్రశాంత్ నీల్ మరో భారీ పౌరాణిక చిత్రం తెరకెక్కించబోతున్నారనే వార్తలు రావడంతో 'సలార్ 2' ప్రాజెక్ట్ నిలిచిపోయిందనే అనుమానాలు మొదలయ్యాయి. ఈ ప్రచారం అభిమానుల్లో ఆందోళనకు దారితీసింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ నీల్ స్పందిస్తూ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తున్న 'డ్రాగన్' చిత్రం పూర్తయ్యాక వెంటనే 'సలార్ 2' పనులు ప్రారంభిస్తానని చెప్పినట్లు సమాచారం. దీంతో సినిమా పూర్తిగా ఆగిపోలేదని, కేవలం షెడ్యూల్ కారణంగా ఆలస్యం మాత్రమే జరుగుతోందని స్పష్టమైంది.

మరోవైపు ప్రభాస్ కూడా వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి 2898 ఏడీ' రెండో భాగం పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులు కొంతవరకు పూర్తయ్యే సమయానికి ప్రశాంత్ నీల్ కూడా తన ప్రస్తుత చిత్రాన్ని పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

అన్ని అనుకున్నట్లుగా సాగితే 2027 చివరి నాటికి 'సలార్ 2' చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం. మొదటి భాగాన్ని మించిన స్థాయిలో యాక్షన్, భావోద్వేగాలు, విజువల్ ఎఫెక్ట్స్‌తో రెండో భాగాన్ని మరింత భారీగా రూపొందించేందుకు మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'సలార్ 2'పై భారీ అంచనాలు నెలకొని ఉండగా, తాజా స్పష్టతతో ప్రభాస్ అభిమానులు మళ్లీ ఈ ప్రాజెక్ట్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు.

# 'లెనిన్' టీజర్‌కు మంచి స్పందన




అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'లెనిన్'పై ప్రేక్షకుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. యువ దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే సినిమా ప్రకటనతో మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది.

ఈ చిత్రం జూన్ 26న ప్రేక్షకుల ముందుకు రానుండగా, చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసింది. మరోవైపు అక్కినేని నాగార్జున సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 40 సంవత్సరాలు పూర్తయిన ప్రత్యేక సందర్భంగా 'లెనిన్' టీజర్‌ను విడుదల చేయడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

విడుదలైన టీజర్‌లో అఖిల్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ యాటిట్యూడ్‌లో కనిపించాడు. ముఖ్యంగా ఆయన చెప్పిన సంభాషణలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. "మనోడు వస్తున్నాడు...", "నేను తప్పిపోయి రాలేదు.. మీ అందరినీ వెతుక్కుంటూ వచ్చా..." వంటి డైలాగులు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. టీజర్‌లో అఖిల్ స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్ షాట్లు అభిమానులను ఆకట్టుకుంటున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.

టీజర్‌పై నాగార్జున కూడా స్పందిస్తూ తనకు ఇది ఒక ప్రత్యేక సర్‌ప్రైజ్‌లా అనిపించిందని తెలిపారు. మొత్తం టీజర్ ఎంతో హాయిగా, ఆకట్టుకునేలా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు కూడా అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచాయి. ఇటీవల వరుస సినిమాలతో ప్రేక్షకులను మెప్పించేందుకు ప్రయత్నిస్తున్న అఖిల్‌కు 'లెనిన్' చిత్రం ఎంతో కీలకంగా మారింది. గత చిత్రాల ఫలితాల తర్వాత మంచి విజయంతో తిరిగి నిలదొక్కుకోవాలని భావిస్తున్న అఖిల్‌కు ఈ సినిమా మైలురాయిగా మారుతుందా అన్న చర్చ సినీ వర్గాల్లో కొనసాగుతోంది.

టీజర్‌ను బట్టి చూస్తే సినిమాలో యాక్షన్, భావోద్వేగాలు, మాస్ అంశాలు సమపాళ్లలో ఉండబోతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో జూన్ 26న విడుదల కానున్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# ఏఐ డీప్‌ఫేక్‌పై రుక్మిణి ఆగ్రహం

'సప్త సాగరాలు దాటి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన నకిలీ బికినీ ఫోటోలు, వీడియో క్లిప్స్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. గ్రీన్ కలర్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లో కనిపిస్తున్నట్లు ఉన్న ఆ విజువల్స్ నెటిజన్లలో పెద్ద చర్చకు దారితీశాయి.

చుట్టూ కెమెరాలు, సాంకేతిక సిబ్బంది కనిపించడంతో ఇది ఏదైనా అధికారిక ఫోటోషూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం అవి కృత్రిమ మేధస్సు సాంకేతికతతో తయారు చేసిన డీప్‌ఫేక్ చిత్రాలేమోనని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ వివాదం మరింత వైరల్ కావడంతో తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందించారు.

ఇంటర్నెట్‌లో తన పేరిట ప్రచారం అవుతున్న బికినీ ఫోటోలు, వీడియోలు పూర్తిగా కృత్రిమ మేధస్సు సాయంతో తయారు చేసిన నకిలీ చిత్రాలేనని ఆమె స్పష్టం చేశారు. అవి పూర్తిగా తప్పుడు సమాచారం ఆధారంగా సృష్టించబడినవని పేర్కొన్నారు. ఇతరుల వ్యక్తిగత గోప్యతను దెబ్బతీసేలా ఇలాంటి మార్ఫింగ్ కంటెంట్ తయారు చేయడం, వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ వ్యవహారాన్ని తన బృందం చాలా సీరియస్‌గా తీసుకుంటోందని రుక్మిణి తెలిపారు. ఈ ఫోటోలను సృష్టించిన వారిపై మాత్రమే కాకుండా, వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై కూడా సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అలాగే నెటిజన్లకు ఆమె ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఎవరూ నమ్మవద్దని, ఇతరులకు షేర్ చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ప్రస్తుతం ఈ ఘటన సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, ప్రముఖులు కూడా డీప్‌ఫేక్ టెక్నాలజీ దుర్వినియోగంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in